జీవితం ★

శ్రీమతి నాయని స్వప్నకుమారి.

"రామయ్య కోడలు కాపరానికొస్తుందట! విన్నావా?" అని నీలాటి రేవు వద్ద ఒక అమ్మలక్క ప్రక్కనున్న ఆవిడను ప్రశ్నించింది.

"సూరిగాడి పెళ్ళామా! ఏవూరమ్మాయి, పిల్ల బాగుంటుందా?" బిందె ముంచుతూ అడిగింది ప్రక్కనున్న ఆవిడ.

"అయ్యో నీకు తెలియదటే కామూ! ఎవరో అమ్మాయి కాదు అక్క కూతురేగా! వేరే పిల్లను చేసుకోవడం ఇష్టంలేక స్వయంగా కూతురు బిడ్డనే కొడుక్కు చేసుకున్నది. అందరికీ తెలిసిన విషయమేగా! క్రొత్తగా అడుగుతున్నావేమే!" బట్టలు పిండుతూ సమాధాన మిచ్చింది సీతమ్మ.

"ఎప్పుడు ఇంటిముందు చేతులు జట్టుగా పట్టి ఇద్దరూ మట్టిలో ఆడేవారు. ఆ అమ్మాయి పేరు లక్ష్మి కదూ! జ్ఞాపకమొచ్చిందిలే." అంటూ బిందెను చంకనెత్తుకుంది కామాక్షి.

"పెళ్ళికూతురిని చూస్తామా! వస్తావా!" అని కామాక్షమ్మను సీతమ్మడిగింది.

"నాకిప్పుడు తీరదమ్మా! సాయంత్రమయితే వస్తానులే! వెళ్ళేటప్పుడు నన్నుకూడా పిలిచిపో, నేను పోవాలి" అంటూ నడిచింది కామాక్షి.

"అట్లాగే పిలుస్తాలే" అని సీతమ్మ తన పనిలో తాను నిమగ్నురాలయింది.

రామయ్య చౌదరిగారిల్లు పెద్ద పందిర వేసి చుట్టు మామిడాకులు కట్టి ఉన్నది. ఎక్కడ చూచినా పచ్చని తోరణాలతో ఇల్లంతా క్రొత్త శోభతో కల కలలాడుతూంది.

పందిరక్రింద పెద్దలంతా కూర్చున్నారు. ఇంటి పెద్ద రామయ్య చౌదరి అందరికీ స్వాగతం చెప్పాడు. అందరూ రామయ్యని అభినందించారు. ఆ వూరికి రామయ్య గ్రామ 'మునసబ్' అందరితో తల్లో నాలుక వలె ప్రవర్తించేవాడు ఆ పల్లెలో అందరూ రామయ్యను చాలా మెచ్చుకునే వారు. కొడుకు పెండ్లికి ఊరివారంతా చాలా సహాయం చేశారు. పెండ్లి పెద్ద ఎత్తులమీదనే జరిగింది. కాని ఆ పెండ్లిని ఆ ఊరి ప్రజలు చూచే భాగ్యం నోచుకోలేదు. పెండ్లి పల్లెలో జరగలేదు. వాళ్ళను సంతోష పెట్టడానికై కోడలను తీసుకొచ్చేటప్పుడు ఆ పల్లె ప్రజలకు గొప్ప విందు చేయాలని యేర్పాటు చేశాడు.

పెండ్లికూతురు "లక్ష్మి" వాకిట్లో దిగింది. చూడడానికి చాలా ముచ్చటగా ఉన్నది. ముఖాన కల్యాణం చుక్క, బుగ్గన కాటుక చుక్క, వంటినిండా నగలు, తలనిండా పువ్వులు, రేగిన జుట్టు ముఖాన పడ్తూంది. అమాయకమైన ముఖం సిగ్గుతో వంచీ వంచనట్లుగా ఉన్నది. పేరే 'లక్ష్మి' పేరుకు తగ్గ అందం అలంకరణతో 'శ్రీ మహాలక్ష్మి' వచ్చి నిలపడినట్లే ఉన్నది చూపులకు. పెద్ద ముత్తయిదువులు వచ్చి నీరాజనాలతో లోపలకు తీసుకు వెళ్ళారు. ఎదురుగా ఉన్న అమ్మమ్మ (అత్త)కు వంగి నమస్కరించింది. 'వెయ్యేళ్ళు వర్థిల్లమ్మా' మనస్సులో దీవిస్తూ కోడలిని (మనుమరాలు) లేవదీసిందామె. తరువాత మామయ్యకు (తాత) నమస్కరించింది. మనుమరాలు కోడలుగా వచ్చినందుకు సంతోషించాడు. తలమీద చెయ్యివేసి నిమురుతూ "వంశాన్ని నిలబెట్టమ్మా" అని దీవించాడు.

పెండ్లికూతుర్ని గదిలో చాపమీద కూర్చోబెట్టారు. వచ్చినవారికి భోజనాలేర్పాటు చేశారు. పంక్తి భోజనాలన్నీ లక్షణంగా జరిగాయి. అందరూ వధూవరులను ఆశీర్వదించారు. పల్లెప్రజలు తెచ్చే కానుకలకంతేలేదు.

కూతుర్ని అప్పగింతలు చేసి తల్లి జానకి కండ్ల నీరు పెట్టింది. "పరాయివాళ్ళు కాదుగా, అందరూ అయినవారేగా! పిల్ల భర్త నీ తమ్ముడు. పిల్ల అత్త, మామ నీ తల్లి దండ్రులే కదా! విచారించకూడ"దని అందరూ సముదాయించారు. ఎవరెన్ని చెప్పినా కన్న తల్లికి అది సహజమే!

లక్ష్మికి ఆ వూరుకొత్తది కాదు. ఆ పల్లెలో పుట్టక పోయినా తాతగారింట్లోనే పెరిగింది. చిన్నతనంలో తనూ, సూరిమామ కలిసి ఎదురుగుండా వున్న ఇసుక దిబ్బలమీద ఆడేవారు. చూచినవాళ్ళంతా "లక్ష్మి" సూరిగాడి పెండ్లామనేవారు. అట్లా అన్నప్పుడల్లా తను కోపంతో అలిగి కూర్చునేది. "'లక్ష్మి' నిన్ను నే పెండ్లి చేసుకోనులే!" అంటూ గడ్డం పట్టుకుని సూరిమామ బ్రతిమాలేవాడు. అతని ముఖం చూచి చిలిపిగా నవ్వేది తను. ఆ అలక, కోపం, అదృశ్యమయిపోయేవి. గదిలో కూర్చుని ఆలోచిస్తూ ఉన్న లక్ష్మి తనలో ఉప్పొంగి పోయేది.

బంధువులంతా వెళ్ళిపోయారు. ఇంటి పెత్తనమంతా అత్తమ్మే చేసేది. చిన్న చిన్న పనులు లక్ష్మి అందుకునేది. అత్తమ్మ అని ఒకసారి, అమ్మమ్మఅని ఒకసారి కొంటెగా పిలిచేది. రామూ లక్ష్మికి మఱిది. పట్లెటూరిలో చదువుతున్నాడు. వదిన అంటే చాలా ప్రేమ. వదిన వళ్ళో పడుకుని చిన్న చిన్న కథలు చెప్పమనేవాడు.

లక్ష్మి కాపురానికొచ్చి యేడాది గడిచింది. ఒక రోజున రామూ పరిగెత్తుకుని వచ్చి "వదినా నేను పట్నం పోతున్నా చదువుకోడానికై తెలుసా!" అని అడిగాడు.

"ఎవరన్నా"రని ప్రశ్నించింది లక్ష్మి.

"సూరన్న పంపిస్తానన్నాడు. నేను పెద్ద చదువు చదువుకుంటానన్నాగా!" అంటూ చిరునవ్వులు కురిపించాడు రామూ.

"అలాగే లే! బాగా చదువుకోవాలి పెద్దవాడివైతే నన్ను మర్చిపోవుకదూ!" అన్న లక్ష్మికి, "ఫో! వదినా! నీవెప్పుడూ ఇంతే!" అంటూ పోయాడు రామూ!

"ఏమిటి మఱిదిగారితో వేళాకోళాలాడుతున్నావే" అంటూ ప్రశ్నించాడు సూరి.

లక్ష్మి భర్తను చూచి "ఏమీలేదు — రామూని పట్నం పంపిస్తున్నారటకదూ!" అన్నది.

"అవును. ఇక్కడుంటే వాడికేమొస్తుంది. నాకొచ్చినంతే వస్తుంది. అందుకని పట్నం పంపిస్తున్నా"నన్నాడు.

"మీకేం మహారాజులు!" కొంటెగా అతని ముఖంలోకి చూస్తూ అన్నది లక్ష్మి.

"నేను మహారాజునైతే, మరి తమరేమవుతారు." నవ్వుతూ అంటున్న సూరికి— "ఒరేయ్ సూరి" అన్న పిలుపు వినిపించి వెనక్కి తిరిగి చూచాడు.

తల్లి వెంకమ్మ యేమిటో చెప్పడానికై వస్తుంది. ఆమె రావడం చూచి అక్కణ్నుంచి మెల్లిగా జారుకుంది లక్ష్మి.

"ఏంటమ్మా ?" అని తల్లిని సూరి ప్రశ్నించాడు.

"లక్ష్మికి మూడో నెలరా !" అంటూ చిరునవ్వుతో అటూ ఇటూ చూచి "లక్ష్మి ఏదిరా" అని అడిగింది వెంకమ్మ.

"ఇప్పు డిక్కడే వుందిగా! ఎక్కడికి వెళ్ళిందో" చిరునవ్వుతో అంటూ వెనక్కి తిరిగి— "అదిగో తలుపు దగ్గర" అంటూ అక్కణ్నుంచి వెళ్ళిపోయాడు సూరి. అత్త చూడడం చూసి సిగ్గుతో తలుపు మూసుకుంది లక్ష్మి.

తొమ్మిది నెలలూ మోసి లక్ష్మి పండులాంటి మొగబిడ్డను కన్నది. లక్ష్మీదేవికి మన్మథుడు పుట్టినట్లుగా పుట్టాడు మగబిడ్డ. ఆ కొడుకుని చూచి "సూరి ! అంతా తల్లి పోలికేరా చాలా అదృష్టవంతుడు" అన్నది తల్లి. ఆమాటలు విని సూరి చాలా పొంగిపోయాడు.

ఆ పసివానికి "సీతాపతి" అని నామకరణం చేశాడు. కాలం దొర్లిపోతోంది. 'సీతాపతి' వచ్చీరాని మాటలతో ఇటు అమ్మనీ నాన్ననీ అటు తాతనూ అవ్వను మురిపిస్తున్నాడు. తప్పటడుగులతో ఇల్లంతా తిరుగుతుండేవాడు. ఆ బిడ్డను చూచి అందరూ ఆనందపడేవారు.

సీతాపతికి మూడవ యేడు. లక్ష్మికి మళ్ళీ రెండవబిడ్డ. ఆపసివాని పేరు 'రంగారావు.' తమ్ముడు రామారావుకు వివాహం చెయ్యాలని అన్న సంబంధం మాట్లాడాడు. ఇంక రెండు సంవత్సరాలలో తమ్ముడి చదువు పూర్తవుతుంది. పెండ్లిచేసి బాధ్యత తీర్చుకోవాలనుకున్నాడు. పరాయి మనువే అయినా కలిగినవాళ్ల యింటి పిల్లను తెచ్చాడు. పెండ్లి వైభవంగా జరిగింది.

కాలం గిర్రున తిరిగింది. రామయ్యా అతని భార్య కాలసముద్రంలో కలిసిపోయారు. పెద్దవాళ్ళు పోవడంవల్ల ఇంటి బాధ్యతలన్నీ కొడుకుమీద పడ్డాయి. అత్తమామలు

పోయినందుకు లక్ష్మి చాలా దుఃఖించింది. ఇంతకాలం పెద్ద వాళ్ళ చాటుననుండి తన జీవితాన్ని గడిపింది. ఇప్పుడే ప్రపంచంలో అడుగు పెట్టింది. తమ్ముడి రామం చదువు పూర్తయింది. తాసీల్దారుగా పనిచేస్తున్నాడు. స్థిరంగా ఒక ఊరిలో ఉండే సంసారం కాదు. వాళ్ళ సంపాదనతో వాళ్ళ సంసారం గడుస్తోంది.

సీతాపతికి పది సంవత్సరాలు. చాలా చురుకైనవాడు. తమ్ముడితో కలిసి బడికివెళ్ళేవాడు. ఆపల్లెలో ఐదవతరగతి వరకే ఉన్నది. అందుచేత సీతాపతి అమ్మమ్మ వాళ్ల ఇంటికి పంపించారు. తెలివయిన వాడు కావడంవల్ల త్వరత్వరగా పైకి వస్తున్నాడు. స్కూల్లో ఉపాధ్యాయుల ప్రేమకు పాత్రుడయినాడు. పిల్లలు కూడా సీతాపతినే ప్రేమించి కలిసి ఆడేవారు.

3

ఆసంవత్సరమే క్రొత్తగా ఆస్కూల్లో అడుగు పెట్టాడు రంగా. తమ్ముడికి క్రొత్తగా ఉండడం వల్ల అన్నతో విడవకుండా తిరిగేవాడు. క్రమక్రమంగా ఆవాతావరణానికి రంగా కూడా అలవాటు పడ్డాడు.

సీతాపతి బి. ఎల్. చదువుతున్నాడు. ఆఖరి సంవత్సరం పరీక్షలు వ్రాసి ఇంటికి వస్తున్నామని కొడుకు వ్రాసిన ఉత్తరం చూచి లక్ష్మి చాలా ఆనందించింది. తన అంత అదృష్టవంతురాలు లేదనుకున్నది. కొడుకు బాగా సంపాదిస్తే తనకేమి కొదవ. చిన్నకొడుకు కూడా ఇంటర్ చదువుతున్నాడు. ఇంక నాలుగు సంవత్సరాలలో చిన్నవాడు కూడా చేతికొస్తాడు. తనకేమి కొదువ. అటువంటి రత్నాలను కన్నందుకు తనకు తానే గర్వించింది.

శలవలిచ్చారు. రావడమే తల్లికి ముందు నమస్కరించాడు సీతాపతి. కొడుకుని కౌగలించుకుంది. ఏమి దీవించాలో తెలియలేదు. కాని రెండు అశ్రుకణాలు ఆ పిల్లవాని నెత్తిన పడ్డవి. చల్లగా తగిలేటప్పటికి తలెత్తి తల్లి ముఖం చూచాడు సీతాపతి. ఇన్నాళ్ళు మాడనందుకని చిరునవ్వుతో తల్లి కండ్లను తుడిచాడు సీతాపతి.

ఎండలు తీవ్రంగా ఉన్నవి. అటునుండి ఇటు ఈడ్చేడ్చి గాడ్పు కొడుతూంది. ఆ యెండలో తండ్రి పొలానికి పోవడం చూచి మేముకూడా వస్తామన్నారు అన్నదమ్ములు. ఎండగా ఉన్నది వద్దన్నాడు తండ్రి బిడ్డలు కందిపోతారన్న భావంతో. 'ఇంతమాత్రానికే కందిపోతామా నాన్న' అన్నాడు సీతాపతి.

"ఫరవాలేదు తీసుకెళ్ళండి" భర్తనుద్దేశిస్తూ అన్నది లక్ష్మి.

ఆ మిడి ఎండలో తండ్రీ బిడ్డలు బయలుదేరారు. బస్తీలో చదువుకునే వాళ్ళు పోతున్నారని వింతగా వాళ్ళని చూస్తున్నారు ప్రజలు. వాళ్ళను వింతగా చూస్తూంటే వాళ్ళను మరీ పరీక్షిస్తూ బయలుదేరారు అన్నదమ్ములు.

"ఎక్కడికండి చినబాబులు కూడా దయచేస్తుండారే?" అని ఒకరు ప్రశ్నించారు.

"ఆ పొలానికేలే" అన్నాడు సూరి.

"వీళ్ళకెందుకో మధ్య" చిన్నగా అన్న చెవిలో ఊదాడు రంగా.

పోనీలే అన్నట్లుగా మందలించాడు తమ్ముణ్ని అన్న

కపర కపర చీకటి పడుతుందనగా ఇంటికి చేరారంతా. కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళిచ్చింది లక్ష్మి. ఆరాత్రి సీతాపతి సరిగ్గా భోంచెయ్యలేదు. తల్లి అడేమనగానే 'ఆకలి లేదన్నా'డు సీతాపతి.

మరునాటికి 'సీతాపతికి' ముమ్మరంగా జ్వరం వచ్చింది. తల్లి చాలా కంగారుపడింది. పిల్లవానికి దిష్టితగిలిందేమోనని దిష్టి తీసింది. కాని జ్వరం తీవ్రంగా ఉన్నది. ఊళ్ళో నాటువైద్యులచేత మందిప్పిస్తున్నారు. జ్వరం తిరుగుముఖం పట్టలేదు. మూడవ రోజుకు వంటిమీద అమ్మవారు చూపెట్టింది చుట్టుప్రక్కల వాళ్ళంతా ఊళ్ళో అమ్మవారున్నదన్న సూచనిచ్చారు.

ఆమాటలతో ఆతల్లి హృదయం తల్లడిల్లింది. పైకి కనపర్చకుండానే బిడ్డకి సేవ చేస్తోంది. మంచంలో సీతాపతి చాలా బాధపడుతున్నాడు. తల్లీ దండ్రికి కంటిమీద కునుకు లేదు. "ఈరోజు గడిస్తే కొడుకుబ్రతికినట్లే" అని చెప్పాడు వైద్యుడు.

ఆరాత్రి చాలా భయంకరంగా ఉన్నది. మృత్యుదేవత సూరయ్య యింట్లో తాండవిస్తున్నట్టుగా ఉన్నది.

సీతాపతికి ఎగ శ్వాస ఆరంభించింది. అతని బాధను చూడలేక తమ్ముడు దూరంగా ఉన్నాడు. తల్లి బిడ్డ కోసం భగవంతుని ప్రార్థిస్తూంది. మగతలో ఉన్న సీతాపతి మెల్లగా కళ్ళు తెరచాడు. తమ్ముణ్ణి దగ్గరకు రమ్మన్నట్లుగా చూచాడు. ఆచూపులో భావాన్ని గ్రహించి రంగ అన్నవద్దకు వచ్చి నిలబడ్డాడు. తమ్ముడికి తల్లీ దండ్రిని చూపించి శాశ్వతంగా కన్నుమూశాడు. ఆయింట్లో సన్నగా వెలిగే దీపం కొండెక్కింది.

దినవారాలు అయిపోయినవి. కొడుకు పోయాడన్న దిగులుతో తల్లి మంచం ఎక్కింది. కాని భగవంతుడు ఆ మాతృమూర్తిని తీసుకుపోలేదు. ఆమె ప్రపంచంలో ఇంకా యేమేమి అనుభవించాలో యెవరికి తెలుసు? ఆమె జీవితం యెట్లా సాగుతుందో ముందు ముందుకు. దేవునిదయవల్లనో లేక వైద్యుని చలవవల్లనో ఆమె ఆయింట్లో లేచి నడవ సాగింది. కాని మునుపటి లక్ష్మి కాదు. ఆమె ముఖంలో చిరునవ్వు మాయమయిపోయింది.

4

రంగా కాలేజీలో ప్రవేశించాడు. ఇప్పుడు వంటరివాడు. కాలేజీలో రోజులు చాలా తొందరగా సాగిపోతున్నవి.

కాలం గిర్రున తిరిగింది. రంగారావు బి. ఏ. చదువుతున్నాడు. చిన్నకొడుకుని చూచి ఇప్పుడిప్పుడే విచారాన్ని మరచిపోయింది. గతాన్ని తలుచుకుని బాధపడేకన్నా మరచిపోవడం మేలనుకున్నది. చిన్నకొడుకైనా వెయ్యేళ్ళు జీవించాలని ఆమె కోరిక.

ఆరోజు పండుగ. పల్లెంతా పండుగలో మునిగి తేలుతోంది. కాని సూరయ్య ఇల్లు మాత్రం చిన్నబోయిఉన్నది. లక్ష్మి మామూలుగా పనిపాటల్లో లీనమయి ఉంది.

ఇంతలో యెవరో వైర్ వచ్చిందని చెప్పారు. సూరయ్య చేతిలోనికి తీసుకున్నాడు. కాని వైర్ చదివి అర్థం చేసుకునేంత చదువు చదువుకోలేదు. కరణంగారి అబ్బాయి చేతికిచ్చి చదివించాడు. "రంగాకు కారు ప్రమాదం జరిగింది. వెంటనే రావలసిందని" వ్రాసి ఉన్నది. అది వినగానే ఆ దంపతుల నెత్తిన పిడుగు పడ్డట్లయింది వెంటనే బస్తీకి బయలుదేరారు.

ఆస్పటల్‌లో రంగారావు మంచంమీద స్పృహలేకుండా ఉన్నాడు. ఒకటే కలవరిస్తున్నాడు. "అన్నా! నేనుకూడా నీదగ్గర కొస్తున్నా" అని. కొడుకుని చూడగానే తల్లి నిర్ఘాంతపోయింది. డాక్టరు లాభం లేదని చెప్పాడు. ఆ సాయంత్రమే అతగాడి ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. కొడుకు పోయాడని వినగానే తల్లి కండ్లనుండి రెండు బిందువులు జారి కిందపడ్డాయి. అంతే ఆమె ఐక స్థాణువులా నిలిచిపోయింది.

సూరయ్య కుప్పకూలినట్లుగా కూలిపోయాడు. చేతికి అందుతూ ఉన్న ఫలాలను యెవరో బలవంతాన లాక్కున్నట్లయింది. దహన కార్యక్రమాలను తీర్చి యింటికి చేరారు.

అడుగు పెడుతూనే సూరయ్య వాకిట్లో పడిపోయాడు. తమ్ముడు రామూ అన్న దుస్థితి చూచి విచారించాడు తను అన్నా వదినలకు యేవిధంగా ఆత్మశాంతి చేకూరుస్తాడు. వారం రోజులనుండి అన్న మంచమెక్కి ఉన్నాడు. రామూ ఆఖరి కొడుకైన రఘూను తెచ్చి అన్న చేతిలో పెట్టాడు. రఘూని మీ బిడ్డగా భావించి మీ దుఃఖాలను మర్చిపొమ్మన్నాడు. రఘూకు 16 సంవత్సరాలు. స్కూలు ఫైనలు నాలుగు సార్లు దండయాత్ర సాగించి విసిగి చదువు మానేశాడు. ఇక ముందునుంచీ రఘూకు తల్లీ దండ్రీ లక్ష్మి సూరయ్యలే. ఆ బిడ్డను చూచి సూరయ్య క్రమంగా కోలుకున్నాడు. అది ఆపిల్లవాని అదృష్టం. సూరయ్య మునసబు గిరీ రఘు హస్తగతం అయింది.

5

రఘూకు ఇరువది సంవత్సరాలు పెంపుడు తల్లి లక్ష్మి తన తమ్ముడి కూతురైన రత్నాంగిని తెచ్చి రఘూకిచ్చి పెండ్లి చేసింది. పెండ్లయిన వారంరోజులకే సూరయ్యకు జ్వరం తగిలింది. ఆ జ్వరం యింక తిరుగు ముఖం పెట్టలేదు. దాన్ని టైఫాయిడ్ అన్నారు వైద్యులు. అంత్య సమయంలో లక్ష్మిని పెంపుడు కొడుకు రఘూ చేతుల్లో పెట్టాడు. అంతే అతను ఈ ప్రపంచంతో సంబంధం లేకుండానే వెళ్ళిపోయాడు.

పుత్రశోకమే కాకుండా భర్తశోకంకూడా వెంటాడింది లక్ష్మికి. సంసారంనుండి విముక్తి పొందాలనుకున్నది. అది ఆమెకు సాధ్యం కావడంలేదు. అందరి ఆయుస్సుపోసుకుని యింకా జీవించి ఉన్నది. కొడుకూ, కోడలి చీదరింపులు తప్పలేదు. రత్నాంగికి కొడుకు పుట్టాడు. వాడి పేరు "సీతయ్య" తన కొడుకుపేరే. మనవణ్ణి చూచుకుని ఆమె కొంత మనశ్శాంతి పొందగలిగింది. ఆమె జీవితమంతా దుఃఖమే! జీవితమంటే ఆమె ముందు ముందు యేమనుకున్నదో కాని ఇప్పుడిప్పుడు జీవితమంటే నరకం అనుకున్నది. తనలాంటి నిర్భాగ్యురాలెవరైనా ఉన్నారా? చేతికందిన కొడుకుల్ని పోగొట్టుకుని గర్భశోకంతో, భర్తను పోగొట్టుకుని వైధవ్యంతో, పెంపుడు కొడుకూ కోడలు చీదరింపులతో ఆమె కానందంలేదు. కాని పోరాడుతూ మధ్య మధ్య సన్నని చిరునవ్వులు విసిరే మనుమణ్ణి చూస్తే ఆమె కెక్కడలేని ఆనందం. అదే జీవితంలో చిట్టచివరకూ మిగిలిన ఆశాఫలం. అదే ఆధారంగా కాలాన్ని వెళ్ళబోసుకుంటూ గడిపేది నిర్భాగ్యురాలయిన లక్ష్మి.